సాక్షి
వికారాబాద్
బుధవారం । 9 । ఏప్రిల్ । 2025



ఎత్తు మడులతో..

మారిన కాలానికి అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో పసుపు సాగు చేపడుతున్నారు. 8లో▸



సరికొత్తగా సైబర్ నేరాలు

సైబర్ నేరగాళ్లు కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. డిజిటల్ లావాదేవీలు పెరగడంతో కొత్త దారులు అన్వేషిస్తున్నారు. 8లో▸



యూనిఫాం తయారీకి సిద్ధం

వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన యూనిఫాంల తయారీకి విద్యాశాఖ చర్యలు చేపట్టింది. 9లో▸

న్యూస్‌రీల్

సుపరిపాలనలో చీమల్‌దరి బెస్ట్

ఉత్తరప్రదేశ్, కేంద్ర బృందం సభ్యుల కితాబు



చీమల్‌దరి గ్రామంలో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అధికారుల బృందం

మోమిన్‌పేట: సుపరిపాలనలో చీమల్‌దరి గ్రామం ఆదర్శంగా ఉందని ఉత్తరప్రదేశ్ అధికారులు, కేంద్ర బృందం సభ్యులు కితాబునిచ్చారు. మంగళవారం 24 మంది సభ్యులతో కూడిన బృందం గ్రామాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, రోడ్లు, భూగర్భ మురుగు కాల్వల నిర్మాణం, ప్రజలకు పంచాయతీ నుంచి అందుతున్న సేవలు, పన్నుల వసూలు, వీధి దీపాల ఏర్పాటు తదితర వాటిని పరిశీలించారు. మారుమూల గ్రామం ఇలా అభివృద్ధి చెందడం సంతోషంగా ఉందన్నారు. గ్రామస్తుల సహకారం, పంచాయతీ పాలకవర్గం పనితీరు అద్భుతంగా ఉందని కొనియాడారు. సుపరిపాలనలో గ్రామానికి జాతీయ అవార్డు రావడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, డీఎల్‌పీఓ సంధ్యారాణి, ఎంపీఓ యాదగిరి, పంచాయతీ కార్యదర్శి సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై సీఎం ప్రత్యేక దృష్టి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి



మహిళా సంఘాలకు యూనిఫాం క్లాత్ అందజేస్తున్న రాజేశ్‌రెడ్డి, నాయకులు

బొంరాస్‌పేట: ప్రభుత్వ పాఠశాలలపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఏర్పుమళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా సంఘాలకు విద్యార్థుల యూనిఫాంకు సంబంధించిన క్లాత్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, మౌలిక వసతులు, భోజనం, ఏకరూప దుస్తులు అందిస్తున్నట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరింత ప్రగతి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రాములు గౌడ్, జయకృష్ణ, మల్లేశం, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, మల్లికార్జున్, హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఐకేపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి గేటు వద్ద గల గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో ఉద్యోగాల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ విజయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ (డాటా ఎంట్రీ ఆపరేటర్) ఒక పోస్టు, ఆఫీస్ సబార్డినేట్ ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఏదైన డిగ్రీతో పాటు కంప్యూటర్ కోర్స్ పూర్తి చేసిన సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఆఫీస్ సబార్డినేట్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 15వ తేదీలోపు హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ మానస హిల్స్ వద్ద ఉన్న గిరిజన గురుకుల ప్రధాన కార్యాలయంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు జాబ్‌మేళా

జిల్లా ఉపాధి కల్పనాధికారి సుభాన్



అనంతగిరి: శ్రీ మంత్ర టెక్నాలజీ సంస్థలో ఉద్యోగాల భర్తీ కోసం ఈనెల 10న వికారాబాద్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సుభాన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 27 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఎంపికైన వారికి ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.30గంటలకు పట్టణంలోని ఐటీఐ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా ఉంటుందన్నారు. నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



పత్తి రైతుకు విత్తన భారం!

ఏటా పెరుగుతున్న ధరలు

- సాగు ఖర్చులు కూడా అదే స్థాయిలో..
- అన్నదాతలపై ఆర్థిక భారం
- జిల్లాలో 60వేల ఎకరాల్లో పంటల సాగు
- సబ్సిడీపై అందజేయాలని వేడుకోలు

కొడంగల్: ఏటా పత్తి విత్తనాల ధరలు పెరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలించక దిగుబడి తగ్గడం, మద్దతు ధర రాక పోవడం, సాగు ఖర్చులు అమాంతం పెరిగి భారీ నష్టాలను చవిచూస్తున్నారు. వీటికి తోడు విత్తనాల ధరలు పెరగడం రైతులను మరింత కుంగదీస్తోంది. జిల్లా వ్యాప్తంగా కంది, వరి, పత్తి, జొన్న, పెసర, మినుము, వామ పంటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రధానంగా వరి, కంది, పత్తి పంటలు సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో రైతులు పొలాలను దుక్కి దున్ని చదును చేస్తున్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి పొలాలను సాగుకు సిద్ధం చేస్తారు. ఆరుగాలం కష్టించి పని చేసే రైతులకు ఇప్పుడు మరో సమస్య వచ్చి పడింది. ప్రస్తుతం మార్కెట్‌లో పత్తి విత్తనాల ధరలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలో బీటీ రకం పత్తి విత్తనాలకు డిమాండ్ ఉంది. ఈ రకం విత్తనాలు మంచి దిగుబడి ఇవ్వడంతో ఇతర సమస్యలను తట్టుకుంటుందని రైతులు భావిస్తున్నారు. గతంలో ఒక ప్యాకెట్ బీటీ పత్తి విత్తనాలు(475 గ్రాములు) రూ.760 ఉండగా ప్రస్తుతం రూ.900కు చేరింది.

ఐదేళ్లలో పెరిగిన పత్తి విత్తనాల (ప్యాకెట్) ధరలు ఇలా..

2021	రూ.760
2022	రూ.810
2023	రూ.840
2024	రూ.850
2025	రూ.900

తప్పని కష్టాలు

మార్కెట్లో పెరిగిన ధరల వల్ల రైతులకు కష్టాలు తప్పడం లేదు. విత్తనాలు నాటింది మొదలు పత్తి దిగుబడి చేతికొచ్చి విక్రయించే వరకు ఇక్కట్లు తప్పడం లేదు. వర్షాకాలం సీజన్ ప్రారంభానికి ముందే పత్తి విత్తనాల కంపెనీలు ధరలను పెంచాయి. దీంతో రైతులపై ఆర్థిక భారం మరింత పెరగనుంది. పెరిగిన సాగు ఖర్చులు.. విత్తనాల ధరల వల్ల ఈ ఏడాది రైతులు పత్తి సాగుకు మొగ్గు చూపుతారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనికితోడు నకిలీ విత్తనాల బెడద పెరిగింది. తక్కువ ధరకు నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి రైతులు పంట దిగుబడి రాక నష్టపోతున్నారు.

పెరుగుతున్న సాగు ఖర్చులు

ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీనికితోడు విత్తనాలు, పురుగు మందులు, కూలీల వేతనాలు కలిపి రూ.వేలల్లో పెట్టుబడులు అవుతున్నాయి. కూలీల రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఎకరానికి రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు కలుపుతీత కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది.

ఎకరానికి మూడు ప్యాకెట్లు

జిల్లాలో కంది, వరి తర్వాత అధిక విస్తీర్ణయంలో సాగు చేసేది పత్తి ఒక్కటే. ఎకరాకు మూడు ప్యాకెట్లు చొప్పున విత్తనాలను విత్తు కోవాల్సి ఉంటుంది. ఒక్కో ప్యాకెట్ 475 గ్రాములు ఉంటుంది. ఇందులో 450 గ్రాములు బీటీ విత్తనాలు, 25 గ్రాములు నాన్ బీటీ విత్తనాలు ఉంటాయి. రైతులు బీటీ విత్తనాల వైపే మొగ్గు చూపుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



ఏటా సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువుల ధరలను ప్రభుత్వం తగ్గించి రైతులను ఆదుకోవాలి.విత్తనాల ధరలు పెరగడం వల్ల మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు వస్తున్నాయి. ధర తక్కువగా ఉందని రైతులు వాటిని కొనుగోలు చేసి మోసపోతున్నారు. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలి. పంటలకు ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించాలి.

– అంజిలప్ప, రైతు, గుండ్లకుంట



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సుధీర్

‘ఆకార్ ఆశా’ సేవలను సద్వినియోగం చేసుకోండి

- అడిషనల్ కలెక్టర్ సుధీర్
- ఉచిత శస్త్ర చికిత్సలపై అవగాహన సదస్సు

మర్పల్లి: పుట్టుకతో వచ్చే లోపాలు, అంగవైకల్యంతో బాధపడే పేదలకు ఆకార్ ఆశా స్వచ్ఛంద సంస్థ ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తుందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంసీఎం ఫంక్షన్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆకార్ ఆశా సేవలపై అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరవణ, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఆకార్ ఆశా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి భారతేంద్రస్వేన్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆకార్ ఆశా సేవలను అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు పుట్టుకతో వచ్చే లోపాలు, అంగవైకల్యం, మొర్రి అంగిలిలో లోపాలు, నాలుక అత్తుకుపోవడం, వినికిడి లోపం, కాళ్ల వేళ్లు, చేతి వేళ్లు అత్తుకుపోవడం, కనుబొమ్మలు, ఇతర అవయవాలు అభివృద్ధి చెందక పోవడం గురించి తెలియజేయడంతోపాటు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య సేవలపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ మంజుల, డాక్టర్ షాలినీ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవరాజ్, డాక్టర్ ప్రవీణ్, పట్లూర్ పీహెచ్‌సీ డాక్టర్ మానస హర్ష, డాక్టర్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ రాజ్ మల్లయ్య, ఎంపీఓ లక్ష్మీకాంత్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, ప్రోగ్రాం ఆఫీసర్ మహేష్‌కుమార్, సీడీపీఓ ప్రవీణ, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణారావు, ఐకేపీ ఏపీఎం మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు



తాండూరులో సమావేశమైన మహిళా సంఘం సభ్యులు (ఫైల్)

విలీనం దిశగా అడుగులు

మెప్మాను సెర్ప్‌లో కలిపేందుకు కసరత్తు

- జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు
- 2,614 స్వయం సహాయక సంఘాలు
- ఇప్పటికే వివరాలు సేకరించిన అధికారులు
- మార్గదర్శకాల కోసం ఎదురుచూపులు

తాండూరు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక మహిళా సంఘాలను ఒకే గొడుగు కిందకు తేవాలన్న ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా అధికారులు ఆ దిశగా కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో ఎన్ని సంఘాలు ఉన్నాయి.. ఎంత మంది సభ్యులు ఉన్నారు అనే వివరాలు సేకరిస్తున్నారు. దాదాపు ఈ ప్రక్రి య పూర్తి కావచ్చినట్లు తెలిసింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యకలాపాలు మున్సిపాలిటీల ఆధ్వర్యంలో కొనసాగుతూవచ్చాయి. మెప్మాను సెర్ప్‌లోకి విలీనం చేస్తే డీఆర్‌డీఏ ఆధీనంలోకి వెళ్తుందా లేక మున్సిపాలిటీలకే బాధ్యతలు అప్పగిస్తారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో 2,614 మహిళా సమాఖ్య సంఘాలు, 26,150 మంది సభ్యులు ఉన్నారు. మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో మెప్మా విభాగం కొనసాగుతూవస్తోంది. ఈ సంఘాల్లోని సభ్యులకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.67.47 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలను అందించారు. ఇక నుంచి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్‌లోకి మెప్మా విలీనం కానుంది. మెప్మాలో 94 మంది ఆర్పీలు, ఇద్దరు టీఎంసీలు, ముగ్గురు డీఈఓలు, నాలుగురు సీఓలు ఉన్నారు. వీరంతా సెర్ప్ ఉద్యోగులుగా మారనున్నారు.

సెర్ప్ ఆధీనంలోకి 2,614 ఎస్‌హెచ్‌జీ గ్రూపులు

జిల్లాలో 2,614 మహిళా సమాఖ్య సంఘాలు ఉన్నాయి. తాండూరు మున్సిపాలిటీలో 1,058 సంఘాలు, వికారాబాద్‌లో 977, పరిగిలో 318, కొడంగల్‌లో 261 సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల్లో 26,150 మంది సభ్యులుగా ఉన్నారు. వీరంతా బ్యాంక్ లింకేజీ రుణాలు పొందుతున్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మున్సిపాలిటీల్లో 149 మంది మహిళలకు రూ.5.21 కోట్లు అందించారు. గ్రూపులుగా ఏర్పడిన సభ్యులకు ఇదే పథకం కింద(26 గ్రూపులకు) రూ.4 కోట్ల రుణాలు అందజేశారు.

మార్గదర్శకాలు రాగానే..



జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో మెప్మా విభాగాన్ని సెర్ప్‌లోకి విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మెప్మా ఉద్యోగులకు సంబంధించిన మార్గ దర్శకాలు ఇంకా జారీ కాలేదు. ప్రస్తుతం మున్సిపాలిటీల్లోనే మహిళా సంఘాలకు సేవలను అందిస్తున్నారు. విలీనం తర్వాత మున్సిపల్ శాఖ ఆధీనంలోనే కొనసాగుతుందా..? లేదా డీఆర్‌డీఓలోకి వెళ్తుందా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

– రవికుమార్, మెప్మా పీడీ, వికారాబాద్

వంట.. మంట



- ఒక్కో సిలిండర్‌పై రూ.50 పెంపు
- జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్లు 2,08,553
- వేసవిలో నెలకు ఒకటి చొప్పున వినియోగిస్తున్న జనం
- ఏడాదికి ఒక్కో కుటుంబంపై రూ.600 వరకు అదనపు భారం

వికారాబాద్: వంట గ్యాస్ ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. కేంద్ర ప్రభుత్వం ఒక్కో సిలిండర్‌పై ఏకంగా రూ.50 చొప్పున పెంచి పేదల నడ్డి విరిచింది. కేంద్రం తీరుపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రస్తుతం 14.2 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.855 ఉండగా, తాజా పెంపుతో రూ.905కు చేరింది.దీంతో జిల్లా వాసులపై నెలకు సగటున రూ.45.78 లక్షల భారం పడనుంది.

ప్రభుత్వంపై అదనపు భారం

జిల్లాలో మొత్తం 2,08,553 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. తెల్లరేషన్ కార్డులు ఉన్న 1,16,990 మందికి రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ అందజేస్తోంది. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ఇప్పటి వరకు ఒక్కో సిలిండర్‌పై రూ.400ల వరకు భరిస్తూ వచ్చిన సర్కారు ఇక నుంచి రూ.450 భరించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రతి నెలా రూ.58,49,500 గ్యాస్ కంపెనీలకు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో మహాలక్ష్మి పథకం వర్తించని గ్యాస్ కనెక్షన్లు 91,563 ఉండగా వారికి నెలనెలా రూ.45,78,150 అదనపు భారం పడనుంది. జిల్లాలో 2,08,553 గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఇందులో జనరల్ కనెక్షన్లు(డబుల్ సిలిండర్లు)19,358, సింగల్ సిలిండర్ కనెక్షన్లు 69,902 ఉన్నాయి. కమర్షియల్ కనెక్షన్లు 3209 ఉండగా దీపం పథకం కింద 35,193 కనెక్షన్లు, ఉజ్వల్ పథకం 38,753 కనెక్షన్లు, సీఎస్ఆర్ కింద 21260 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి.

ఆర్థిక భారం



గ్యాస్ సిలిండర్ ధరను ఒకేసారి 50 రూపాయలు పెంచడం సరికాదు. నెలకు ఒక సిలిండర్ అయిపో తున్న పరిస్థితిల్లో ఇది ఆర్థిక భారమే. గ్యాస్ ధరలు తగ్గిస్తామని చెప్పి ఇలా పెంచుతూ పోతే మాలాంటి పేదల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుంది. పెంచిన ధరను వెంటనే తగ్గించాలి.

– లక్ష్మి, గృహిణి, చౌడాపూర్

సబ్సిడీ ఇవ్వకపోగా..



రాష్ట్ర ప్రభుత్వం 500కే సిలిండర్ ఇస్తామని చెప్పింది.. కానీ సబ్సిడీ డబ్బు మా ఖాతాలో జమ కావడం లేదు. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై ఏకంగా రూ.50 పెంచి పెను భారం వేసింది. ఇలా ధరలు పెంచుకుంటూ పోతే సామాన్యులు ఎలా బతకాలి.

– మంజుల, గృహిణి, నవాబుపేట

కేంద్రం పునరాలోచన చేయాలి



కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై ఒకేసారి రూ. 50 పెంచడం దారుణం. రోజురోజుకూ నిత్యావసరాల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వంట గ్యాస్ ధర పెంచడం సరికాదు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి పెంచిన ధరను వెంటనే తగ్గించాలి.

– తుంకిమెట్ల రాజు, హస్నాబాద్

ప్రజలకు అందుబాటులో ఉండాలి

జిల్లా వైద్యాధికారి వెంకటరవణ

మోమిన్‌పేట: ఆశ వర్కర్లు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యాధికారి వెంకటరవణ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక రోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఆశ వర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ఆరోగ్య సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. గర్భిణులను ఆస్పత్రికి తీసుకొచ్చే బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. రోగులకు తక్షణం వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆస్పత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సుజల, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆశ వర్కర్లతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటరవణ

సత్వర పరిష్కారం

- అందుబాటులోకి ‘ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం’
- ‘సూపర్ వైజరీ కంట్రోల్ అండ్ డేటా ఆక్విజేషన్’తో అనుసంధానం
- అందుబాటులోకి తెచ్చిన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. సబ్‌స్టేషన్లలో తరచూ తలెత్తే సాంకేతిక సమస్యలు సహా విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, ఈదురుగాలితో కూడిన వర్షానికి ఫీడర్ ట్రిప్ అవుతుండటం, షార్ట్‌సర్క్యూట్ కారణంగా అండర్ గ్రౌండ్(యూజీ) కేబుల్స్, ఎయిర్ బంచడ్ (ఏబీ) కేబుల్స్ జాయింట్ల వద్ద తలెత్తే సాంకేతిక సమస్యల కారణంగా నిలిచిన విద్యుత్ సరఫరాపై సీఎండీ మొదలు క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అలర్ట్ చేసే ‘ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం’ (ఎఫ్‌ఓఎంఎస్) సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే అమల్లో ఉన్న ‘సూపర్ వైజరీ కంట్రోల్ అండ్ డేటా ఆక్విజేషన్’ (స్కాడా)కు అనుసంధానం చేసింది. దీంతో ఏ సబ్‌స్టేషన్‌లోని ఫీడర్.. ఏ సమయంలో ట్రిప్ అయింది.. ఏ ప్రాంతానికి.. ఎంత సమయం కరెంట్ సరఫరా నిలిచిపోయింది.. సరఫరాను ఎన్ని గంటల్లో పునరుద్ధరించారు.. వంటి సమగ్ర సమాచారం ఉన్నతాధికారులకు చేరవేస్తోంది. ఫలితంగా కరెంట్ కోతలు, సరఫరా పునరుద్ధరణలో చోటు చేసుకుంటున్న జాప్యంపై క్షేత్రస్థాయి సిబ్బంది సాకులు చెప్పి తప్పించుకునే అవకాశం ఉండదు.



ఆఫీసు నుంచి మానిటరింగ్ చేస్తున్న సీఎండీ

ఆరా తీయాల్సిన అవసరం లేకుండా..

ఈదురు గాలులతో కూడిన వర్షానికి పెద్ద సంఖ్యలో ఫీడర్లు ట్రిప్పవుతుంటాయి. ఒకేసారి అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఈ సమయంలో ఎవరైనా వినియోగదారులు ఫ్యూజ్ ఆఫ్ కాల్‌సెంటర్ (ఎఫ్‌ఓసీ) సహా 1912/ లేదా క్షేత్రస్థాయి జేఎల్‌ఎం, ఏఈలకు సమాచారం ఇస్తే కానీ సంబంధిత అధికారులకు విషయం తెలిసేది కాదు. సాంకేతిక సమస్య గుర్తింపు క్షేత్రస్థాయి సిబ్బందికి పెద్ద సమస్యగా మారేది. అర్ధరాత్రి జోరున కురిసే వర్షం లోనూ లైన్ టు లైన్ తిరగాల్సి వచ్చేది. సమస్యను గుర్తించి, సరఫరాను పునరుద్ధరించేందుకు రెండు మూడు గంటల సమయం పట్టేది. ఇంట్లో కరెంట్ లేకపోవడంతో వినియోగదారుల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యా దులు వచ్చేవి. ఈ సమయంలో సీఎండీ సహా ఇతర ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందికి ఫోన్ చేసి ఆరా తీస్తే.. సరైన కారణం చెప్పే వారు కాదు. కొంత మందైతే ఏకంగా ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించే వారు. ఇది వారికి తలనొప్పి గా మారేది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ ఫీడర్ ఔటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టంతో తలెత్తిన సాంకేతిక సమస్యతో పాటు సరఫరా పునరుద్ధరణ వెంటనే తెలిసిపోతుంది. కేంద్ర కార్యాలయాల్లో కూర్చొనే క్షేత్రస్థాయి సిబ్బంది పని తీరును మానిటరింగ్ చేసే వెసులుబాటు కలుగుతుంది.

అత్యవసర పరిస్థితుల్లో కీలకం

గ్రేటర్‌లో 11 కేవీ ఫీడర్లు 3,421 వరకు ఉన్నాయి. వీటిలో 1,353 ఫీడర్లను ఇప్పటికే ఈ ఎఫ్‌ఓఎంఎస్ పరిధిలోకి తీసుకొచ్చింది. ఆయా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనే తెలుసుకునే అవకాశం ఉంది. నాలుగు రోజుల క్రితం భారీ ఈదురుగాలితో కూడిన వర్షానికి గ్రేటర్‌లో 449 ఫీడర్లు ట్రిప్పయ్యాయి. ఈ ఎఫ్‌ఓఎంఎస్ సహకారంతో 410 ఫీడర్ల పరిధిలో అరగంటలోనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సోమవారం హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధిలో హిందీనగర్, అలియాబాద్, బ్యాంక్‌కాలనీ సహా హబ్సిగూడ సర్కిల్ పరిధిలో బోడుప్పల్, సూర్యాహిల్స్‌కాలనీ ఫీడర్ల పరిధిలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని ప్రాగాటూల్స్, రైతుబజార్, మేడిబావి, ఆర్పీనిలయం, ఈఎంఈ ఫీడర్ల పరిధిలోనూ సాంకేతిక సమస్యలు వచ్చాయి. ఆయా ప్రాంతాల్లోని గృహాలు, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎఫ్‌ఓఎంఎస్ సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయా ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరాను పునరుద్ధరించడంతో పాటు తలెత్తిన సాంకేతిక సమస్యలను గుర్తించి, వ్యవస్థను చక్కదిద్దే పనిలో నిమగ్నమయ్యారు.

క్లుప్తంగా

బ్లాక్ ప్లాంటేషన్‌ను పరిశీలించిన అధికారులు


మొక్కలు కాలిపోయిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నవాబుపేట: మండల పరిధిలోని నారెగూడ గ్రామం సర్వే నంబర్ 153లో నాలుగేళ్ల క్రితం హరితహారంలో భాగంగా బ్లాక్‌ప్లాంటేషన్ కింద 8వేల మొక్కలు నాటారు. వీటి చుట్టూ గడ్డి ఏపుగా పెరిగింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించడంతో మొక్కలు కాలిబూడిదయ్యాయి. ఈ విషయాన్ని 'సాక్షి'దినపత్రికలో మంగళవారం 'అగ్నికి ఆహుతైన బ్లాక్ ప్లాంటేషన్' శీర్షికన వెలుగులోకి తెచ్చింది. ఇందుకు స్పందించిన అధికారులు ఎంపీఓ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శోభ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అనంతరం ఎంపీఓ మాట్లాడుతూ.. కాలిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటుతామన్నారు. ఏపుగా పెరిగిన మొక్కలకు నీరందిస్తే బ్రతికే అవకాశం ఉందన్నారు. ఉపాధి హామీ సిబ్బందితో నీరు అందిస్తున్నామని చెప్పారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్


పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు, అదుపులో డ్రైవర్లు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని మహంతీపూర్ వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు మంగళవారం తెల్లవారుజామున పట్టివేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఎస్‌ఐ రవూఫ్, కానిస్టేబుళ్లు మండల పరిధిలోని రేగడిమైలారం వద్ద మహంతీపూర్‌కు చెందిన బందెయ్య, మహేందర్, అంజి ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేశబూరు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

కేసు నమోదు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లిలో సోమవారం మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం చేసుకున్న విషయం విదితమే. ఈ ఘటనపై మంగళవారం మృతుడి అన్న ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ రవూఫ్ తెలిపారు. తన తమ్ముడికి తల్లిదండ్రులు లేకపోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని కొడంగల్‌కు చెందిన నడిమింటి కిష్టప్ప ఫిర్యాదు చేశారన్నారు. మృతుడి భార్య, తన మరదలు నర్సమ్మ, ఇతరుల ప్రమేయం లేదన్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబ పోషణ భారంగా ఉందని తరచుగా మల్కప్ప మనస్తాపానికి గురయ్యేవాడని చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

మాడ్గుల: నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేశారు. సీఐ వేణుగోపాల్ రావు తెలిపిన ప్రకారం.. మంగళవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. మండల పరిధిలోని అందుగుల శివారు నుంచి ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తున్నారు. పోలీసులు వాహనాన్ని నిలిపి పత్రాలు పరిశీలించారు. ఎటువంటి అనుమతులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ వాహన యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.

వైన్స్‌లో చోరీ

యాచారం: ఓ వైన్స్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ.30 వేల నగదు చోరీ చేశారు. వివరాలు.. మండల కేంద్రంలోని నందివనపర్తి రోడ్డులో లక్కీవైన్స్ యజమానులు సోమవారం రాత్రి షాప్‌నకు తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం వైన్స్ వద్దకు వచ్చి చూడగా షటర్లు పగులగొట్టి ఉన్నాయి. గల్లాపెట్టెలోని రూ.30 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యా దు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి బలవన్మరణం

కొందుర్గు: కుటుంబ సమస్యల కారణంగా తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని గంగన్నగూడలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చింతకింది రాములు(35)కు 12 ఏళ్ల కిత్రం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కవితతో వివాహమైంది. వీరికి కుమారుడు, కూతురు సంతానం. పది రోజుల క్రితం కుమారుడు అస్వస్థతకు గురవ్వడంతో కవిత పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో రాములుకు వ్యవసాయంలో నష్టం రావడం, కుమారుడి ఆరోగ్యం బాగులేకపోవడం, భార్య పుట్టింటికి వెళ్లడంతో తాగుడుకు బానిసయ్యాడు. మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం రాములు గది తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి తలుపు తట్టిచూడగా అప్పటికి ఉరేసుకుని మృతి చెందియున్నాడు. మృతుడి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎత్తుమడులతో అధిక దిగుబడులు

వ్యవసాయ నూతన సాగు విధానాలు రైతు ఇంట సిరులు కురిపిస్తోంది.
ఎత్తుమడుల (బెడ్) పద్ధతిలో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు.

- బెడ్ పద్ధతి సాగుతో అధిక లాభాలు
- ఎరువులు, నీటి యాజమాన్యం పాటించాలి
- ఉద్యాన అధికారి అక్షితారెడ్డి


మోమిన్‌పేటలో బెడ్డు పద్ధతిలో సాగు చేసిన పసుపు పంటను తీస్తున్న కూలీలు

మోమిన్‌పేట: మారిన కాలానికనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో పసుపు సాగు చేపడుతుంది. బోజ, బెడ్డు పద్ధతిలో సాగుకు సమాయత్తం అవుతున్నారు. బెడ్డులో విత్తనం తక్కువ పట్టడం, డ్రిప్ పద్ధతిలో నీరును పెట్టడంతో కూలీల ఖర్చును తగ్గించుకోవచ్చని రైతులు పేర్కొంటున్నారు. బెడ్, డ్రిప్ పద్ధతిలో భూమి గుల్లగా ఉండి కొమ్ము సాగుకు అనుకూలంగా ఉంటుందని దీంతో దిగుబడులు పెరుగుతాయని రైతులు వెల్లడిస్తున్నారు. ఎరువులు, నీటి యాజమాన్యం సరైన పద్ధతిలో పాటిస్తే దిగుబడులు అధికంగా వస్తాయని ఉద్యాన అధికారి అక్షితారెడ్డి పేర్కొన్నారు. 20 ఏళ్ల క్రితం సాగు నీటి వసతి కల్గిన ప్రతీ రైతు పసుపు పంటను సాగు చేసేవారు. అర ఎకరా నుంచి మూడు ఎకరాల వరకు సాగును చేపట్టేవారు. మార్కెటులో ధర లేకపోవడం, పెట్టుబడులకు గిట్టుబాటు కాక పసుపు సాగును రైతులు పూర్తిగా విస్మరించారు. సాగు నీటి వసతి కలిగిన ప్రతీ రైతు పసుపు సాగు చేపట్టేవారు. ప్రస్తుతం పసుపు సాగు చేసే రైతులను వేళ్ల మీద లెక్కించవచ్చు. పసుపు సాగుకు పెట్టుబడులు ఎక్కువ... దిగుబడులు రాకుంటే నష్టాలు తప్పవు. పంట కోతకు వచ్చినప్పుడు కూలీల ఖర్చు ఎక్కువే. అందుకు మార్కెట్‌లో సుమారు 15 ఏళ్లుగా ధర లేక సాగుకు దూరంగా ఉన్నారు. గతేడాది నుంచి క్వింటాల్‌కు రూ.10వేలు దాటుతుండటంతో సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. పసుపు సాగు పెరగాలంటే ప్రభుత్వం విత్తన రాయితీ ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఆశించిన స్థాయిలో దిగుబడులు



ఎకరన్నరలో బెడ్డు పద్ధతిలో పసుపు సాగు చేశా. ఎరువులు, మందులను డ్రిప్ ద్వారా అందించడంతో పంట ఏపుగా పెరిగింది. మార్కెట్‌లో ధర రూ.10వేలకు పైగా ఉండడంతో ఈ సాగు చేపట్టాను. ట్రాక్టరు ద్వారానే పసుపును తీశాం. దిగుబడులు ఆశించిన స్థాయిలో వచ్చాయి. ఆవిరి యంత్రం ద్వారా ఉడికించాం. 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. – మోహన్‌రెడ్డి, రైతు, మోమిన్‌పేట

సరికొత్తగా సైబర్ నేరాలు

- రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీ
- ఆపై డిజిటల్ లావాదేవీల పిన్ నంబర్లను గుర్తించి డబ్బులు కాజేస్తున్న దుండగులు



మోమిన్‌పేట: సైబర్ నేరగాళ్లు కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. డిజిటల్ లావాదేవీలు పెరగడంతో కొత్త దారులు అన్వేషిస్తున్నారు. బస్సులు, సంతలు తదితర రద్దీ ప్రదేశాల్లో సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న దుండగులు డిజిటల్ పేమెంట్స్ రూపంలో నగదు బదిలీచేసుకుంటున్నారు. మోమిన్‌పేట ఠాణా పరిధిలో ఒకే నెలలో రెండు ఇలాంటి కేసులే నమోదయ్యాయి. మోమిన్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రశీద్ విధుల్లో భాగంగా వికారాబాద్ వెళ్లాల్సి రావడంతో బస్సు ఎక్కాడు. అంతలోనే ఫోన్ చోరీకి గురైంది. వెంటనే బ్యాంకులకు సమాచారం అందించడంతో డబ్బులు పోలేదు. మార్చి 2న మోమిన్‌పేటకు చెందిన రుద్రశెట్టి శివకుమార్ వికారాబాద్‌కు వెళ్లేందుకు బస్టాండులో బస్ ఎక్కాడు. అంతలోనే ఫోన్ అపహరణకు గురైంది. మరుసటి రోజు బ్యాంకులకు సెలవు ఉండడం, బ్యాంకులకు సమాచారం ఇవ్వాలన్న ఆలోచన లేకపోవడంతో మరుసటి రోజు రెండు వేర్వేరు ఖాతాల నుంచి రూ.1.44లక్షలు నగదు బదలాయింపు జరిగింది. డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన పిన్ నంబర్‌ను గుర్తించి ఈ దురాగాతానికి పాల్పడ్డారు. వారం రోజులకు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు రూ.68వేలు ఫ్రీజ్ చేశారు. మిగిలిన డబ్బును కూడ రాబడతామని సీఐ వెంకట్ తెలిపారు.

ఫోన్ పోయిన బాధలోనే ఉన్నా



ఫోన్ చోరీకి గురైందన్న బాధలోనే ఉన్నా. బ్యాంకులకు సమాచారం ఇవ్వాలని తెలియదు. బ్యాంకు ఖాతాలో సురక్షితంగా ఉంటాయని అనుకున్నా. సీక్రెట్ నంబర్ ఎలా కనిపెట్టారో తెలియడం లేదు.
– శివకుమార్, బాధితుడు, మోమిన్‌పేట

దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్

ఎస్పీ కార్యాలయం ఎదుట కరీంపూర్ గ్రామస్తుల ఆందోళన


కరీంపూర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: కరీంపూర్ గ్రామంలో అమాయకులపై దాడులు చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు అనిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కరీంపూర్ గ్రామస్తులు మంగళవారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో పలువురు అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. గ్రామానికి చెందిన అజాం ఆయన అనుచరులు అకారణంగా తమపై దాడి చేశారన్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేయగా అక్కడికి వచ్చిన స్థానిక పోలీసుల సమక్షంలోనే దాడికి పాల్పడ్డారని తెలిపారు. తాము ఇచ్చిన ఫిర్యాదుకు ఇప్పటి వరకు స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో తాము ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తామన్నారు. ఎస్పీ ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామంలో శాంతియుత వాతవరణం కల్పించాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



ఎంపీడీఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

షాద్‌నగర్: గ్రామ పంచాయితీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జీపీ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంల ఆవరణలో ఎంపీడీఓ బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... పంచాయతీ కార్మికులకు రెండు నెలల వేతనాలను మాత్రమే కార్మికుల ఖాతాలలో వేశారని, మరో మూడు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించడంతో పాటుగా పర్మినెంట్ గుర్తింపు కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ బన్సీలాల్ మాట్లాడుతూ.. డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని, మా పరిధిలోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య, నా యకులు రాజునాయక్, శంకర్‌నాయక్, జీపీ కార్మికులు తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో లెక్చరర్ మృతి

తాండూరు టౌన్: అనారోగ్యంతో ఓ లెక్చరర్ మృతి చెందిన ఘటన మంగళవారం తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల గ్రామానికి చెందిన గంజి రవికుమార్ (50) స్థానిక సిద్దార్థ జూనియర్ కళాశాలలో బోటని లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత ఎప్‌సెట్ తరగతుల్లో శిక్షణ ఇస్తున్నాడు. రెండు రోజులుగా తరగతులకు రాకపోవడంతో సహ అధ్యాపకులు ఇంటికి వెళ్లి చూడగా విగత జీవిగా పడి ఉన్నాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం చేరవేశారు. అప్పటికే ఆయన మృతి చెందారని పోలీసులు నిర్ధారించారు. కొన్నేళ్లుగా రవికుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు చెప్పారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేసి, మృతదేహాన్ని వారికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

వివాదాస్పద భూముల పరిశీలన

శంషాబాద్: పట్టణంలో సుమారు ముప్పైకి పైగా ఎకరాల్లో వివాదాస్పదంగా ఉన్న వివిధ భూముల ను హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మంగళవారం అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. సింప్లెక్ రహదారి నుంచి ఇరువైపులా హెచ్‌ఎండీ ఆధీనంలో ఉన్న భూములతో పాటు వివాదాస్పదంగా కోర్టుల్లో ఉన్న భూములన్నింటినీ ఒక్కొక్కటిగా పరిశీలించారు. సింప్లెక్స్ నుంచి జీఎస్ఎన్ యూఆర్‌ఎం గృహాల వరకు సుమారు రెండు కిలో మీటర్ల మేరకు నడుచుకుంటూ వెళుతూ భూముల వివరాలను తెలుసుకున్నారు. వివాదంలో ఉన్న భూము లు, ప్రభుత్వ అవసరాలకు అప్పగించిన భూములు, సర్వేలు ఉన్న భూముల వివరాలు తీసుకున్నారు. భూమిని కోల్పోయిన ప్రత్యామ్నా యంగా హెచ్‌ఎండీఏ నుంచి తీసుకున్న భూముల వివరాలను తెలుసుకున్నారు. కోర్టులో ఉన్న వివా దాస్పదంగా ఉన్న భూములపై కౌంటర్ దాఖలు చేసేందుకు పటిష్టంగా వివరాలు సేకరించినట్లు సమాచారం. కమిషనర్ వెంట హెచ్‌ఎండీఏ అధికారుల బృందం తహసీల్దార్ రవీందర్‌దత్ ఉన్నారు.

పోగొట్టుకున్న బంగారం రికవరీ


బాధితుడికి బంగారం అప్పగిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కేశంపేట: శుభకార్యంలో జరిగిన గొడవలో బంగారం పోగుట్టుకున్న వ్యక్తి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి పోగుట్టుకున్న బంగారు ఆభరణాన్ని రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. వివరాలు.. మండల పరిధిలోని సంతాపూర్‌కు చెందిన గుండేటి నర్సింహ సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌లో నిర్వహిస్తున్న శుభకార్యానికి హాజరయ్యాడు. అక్కడ బంధువులతో జరిగిన గొడవలో తన రెండు తులాల బ్రాస్‌లెట్ పోగొట్టుకున్నాడు. మంగళవారం బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సీసీ కెమెరాలను పరిశీలించాడు. బంగారం తీసుకున్న వ్యక్తిని గుర్తించి అతడి వద్ద నుంచి రికవరీ చేశారు. సీఐ నరహరి, ఎస్‌ఐ రాజ్‌కుమార్ బాధితుడికి రికవరీ చేసిన బ్రాస్‌లెట్ అప్పగించారు.

మహిళా ఆరోగ్యంతోనే సంతోషం

ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ వినితాదేవి

యాచారం: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాల్లో సంతోషం ఉంటుందని ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ వినితాదేవి అన్నారు. మంగళవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళల ఆరోగ్యం, గర్భిణి, బాలింతలకు అందించే పౌష్టికాహారం, చిన్నపిల్లల సంరక్షణపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాచారం ఎంపీడీఓ నరేందర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్‌ను 52శాతానికి పెంచాలి


మాట్లాడుతున్న గట్యానాయక్

బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్

పరిగి: బీసీలకు బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని బీఎంపీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ ఆరోపించారు. మంగళవారం ఆయన పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9న బీపీఎం ఆధ్వర్యంలో జాగోరే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈవీఎం మిషన్ల ట్యాంపరింగ్‌తో బీజేపీ ఎక్కువ సీట్లు గెలుచుకుంటుందని చెప్పడమే ఈ కార్యక్రమ ఉద్దేశం అన్నారు. సుప్రీం కోర్టు సైతం ఈవీఎం ద్వారా ఎన్నికలు పారదర్శకంగా జరగవని తేల్చి చెప్పిందన్నారు. వక్ఫ్ బిల్లును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యల చేశారని వారిపై చర్యలు తీసుకోవడంలో కేంద్రం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, నాయకులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

వ్యక్తి దుర్మరణం

నందిగామ: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టండంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని రంగాపూర్ శివారులో (44 నెంబరు జాతీయ రహదారి) బైపాస్ రోడ్డుపై సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన ఆంజనేయులు(48) భిక్షాటనతో పాటు ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు సేకరించి అమ్ముకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో 44వ నంబరు జాతీయ రహదారిపై రంగాపూర్ శివారులోని ఓ పెట్రోల్ పంపు సమీపంలో రోడ్డుపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు తీవ్రగాయాలకు గురయ్యాడు. విషయం తెలసుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా అప్పటికే ఆంజనేయులు మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత స్థానికులు 108 కు కాల్ చేస్తే అంబులెన్స్ వాహనం సకాలంలో రాలేదని.. లేదంటే తన భర్త బ్రతికేవారని మృతిడి భార్య ఆరోపించారు.

అచ్చం అలాగే!

2007 మాదిరిగానే 2013 నాటి పేలుళ్లు

- మకాం నుంచి విధ్వంసం వరకు సారూప్యత
- రెండు విధ్వంసాలకూ ఐఎం సంస్థదే బాధ్యత
- దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసు నేపథ్యం..
- ఐదుగురు నిందితులకు ఎన్‌ఐఏ కోర్టు ఉరిశిక్ష
- తీర్పును సమర్థించిన తెలంగాణ హైకోర్టు

సాక్షి, సిటీబ్యూరో: నిషేధిత ఉగ్రవాద సంస్థ ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) ఐదున్నరేళ్ల వ్యవధిలో నగరంలో రెండు భారీ విధ్వంసాలను సృష్టించింది. 2007 ఆగస్టు 25న గోకుల్‌చాట్, లుంబినీ పార్క్‌ల్లో బాంబుల్ని పేల్చి 47 ప్రాణాలు తీసి, మరో 300 మంది వరకు క్షతగాత్రుల్ని చేసింది. ఆ తర్వాత 2013 ఫిబ్రవరి 21న ముష్కరులు మరోసారి 18 మందిని చంపి, 131 మందిని క్షతగాత్రుల్ని చేశారు. ఈ రెండు ఆపరేషన్ల మధ్య అనేక సారూప్యతలు ఇలా ఉన్నాయి. దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్ల కేసులో ఐదుగురు నిందితులకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) ఫాస్ట్‌ట్రాక్ కోర్టు 2016లో ఉరిశిక్ష విధించగా.. దీనిని సమర్థిస్తూ తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం మంగళవారం తీర్పు వెలువరించింది.

అనుమానం రాని చోట మకాం..

సిటీని టార్గెట్‌గా చేసుకుని విధ్వంసం సృష్టించడానికి నిర్దిత సమయం ముందు వచ్చిన ఐఎం ఉగ్రవాదులు పోలీసుల దృష్టి పడని, వారికి అనుమానం రాని ప్రాంతాల్లోనే షెల్టర్లు ఏర్పాటు చేసుకున్నారు. 2007 నాటి జంట పేలుళ్ల కోసం నగరానికి వచ్చిన ఉగ్రవాదులు హబ్సిగూడలోని స్ట్రీట్ నెం.8లో ఉన్న బంజారా నిలయం అపార్ట్‌మెంట్‌లోని 302 ఫ్లాట్‌ను ఎంచుకుంటే.. 2013 ఫిబ్రవరి నాటి దిల్‌సుఖ్‌నగర్ ఆపరేషన్ పూర్తి చేయడం కోసం వచ్చిన వారు అబ్దుల్లాపూర్‌మెట్ సాయినగర్‌లో ఉన్న రేకుల ఇంటిలో ఆశ్రయం పొందారు. ఈ రెండు సందర్భాల్లోనూ విద్యార్థులం అంటూనే ఇళ్లు అద్దెకు తీసుకున్నారు. రెండు ఇళ్ల యజమానులూ వాటికి సమీపంలో లేకపోవడం వీరికి కలిసి వచ్చింది.

రెండుసార్లూ ముగ్గురే..

గోకుల్‌చాట్, లుంబినీ పార్క్ విధ్వంసాల కోసం ముష్కరులు 25 రోజుల ముందు నగరానికి చేరుకోగా.. దిల్‌సుఖ్‌నగర్ పేలుళ్ల కోసం మాత్రం కేవలం 16 రోజుల ముందే వచ్చారు. 2007లో తొలుత అనీఖ్ షఫీఖ్ సయీద్ (లుంబినీ పార్క్‌లో బాంబు పెట్టాడు) అనే ఉగ్రవాది వచ్చాడు. షెల్టర్ ఏర్పాటు చేశాక అక్బర్ ఇస్మాయిల్ చౌదరి (ఇతడు పెట్టిన బాంబు పేలలేదు)ని పిలిపించాడు. ఇద్దరూ కలిసి ప్రాథమిక రెక్కీలు పూర్తి చేసిన తర్వాత పేలుడుకు రెండు రోజుల ముందు మాత్రమే ప్రధాన సూత్రధారి, పాత్రధారి అయిన రియాజ్ భత్కల్ (గోకుల్ చాట్‌లో పెట్టింది ఇతడే) చేరుకుని బాంబుల పని పూర్తి చేశాడు. ఆ తర్వాత ఒక రోజు తమ గదిలోనే ఉండి తిరిగి వెళ్లారు. దిల్‌సుఖ్‌నగర్ ఆపరేషన్ కోసం మొదట తెహసీన్ అక్తర్ అలియాస్ మోను (ఏ–1 మిర్చి సెంటర్ వద్ద బాంబు పెట్టిన వ్యక్తి) రాగా.. కొన్ని రోజులకు తబ్రేజ్, వఖాస్ (107 బస్టాప్‌లో పెట్టిన వ్యక్తి) వచ్చారు. ఈ ముగ్గురూ కలిసి రెండు పేలుళ్లు జరిపి వెళ్లారు.

కామన్ 'పాయింట్' దిల్‌సుఖ్‌నగర్

2007లో గోకుల్‌చాట్, లుంబినీ పార్క్ పేలుళ్ల ఆపరేషన్, 2013లో ఏ–1 మిర్చి సెంటర్, 107 బస్టాప్‌ల వద్ద జరిగిన విధ్వంసం.. ఈ రెండు అంశాల్లోనూ దిల్‌సుఖ్‌నగర్ కామన్ పాయింట్‌గా ఉంది. అప్పట్లో గోకుల్‌చాట్‌లో రియాజ్, లుంబినీ పార్క్‌లో అనీఖ్ బాంబులు పెట్టగా... అక్బర్ మరో బాంబును దిల్‌సుఖ్‌నగర్‌లోని వెంకటాద్రి థియేటర్ ఎదురుగా ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ వద్ద వదిలి వెళ్లాడు. ఆ రెండూ పేలగా... ఇది పేలలేదు. దిల్‌సుఖ్‌నగర్ ఆపరేషన్‌లో మాత్రం ఉగ్రవాదులు నేరుగా దిల్‌సుఖ్‌నగర్‌నే టార్గెట్ చేసి రెండు బాంబుల్ని పేల్చారు. ఈ రెండు ఉదంతాలపై నమోదైన ఐదు కేసుల్లోనూ రియాజ్ భత్కల్ ప్రధాన నిందితుడిగా, మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు. 2007లో నేరుగా వచ్చి హబ్సిగూడలోని గదిలో బాంబుల్ని అసెంబుల్ చేసి గోకుల్‌చాట్‌లో బాంబు పెట్టగా.. 2013లో మాత్రం పాకిస్థాన్ నుంచి నేతృత్వం వహించి చేయించాడు. బాంబుల అసెంబ్లింగ్ బాధ్యతల్ని వఖాస్‌కు అప్పగించాడు.

మంగుళూరు నుంచే 'పార్సిల్స్'

ఈ రెండు జంట పేలుళ్లకు అవసరమైన పేలుడు పదార్థం, డిటొనేటర్లు ఉగ్రవాదులు నగరానికి చేరుకున్న తర్వాతే వారికి అందాయి. 2007లో విధ్వంసం సృష్టించడానికి పదిహేను రోజుల ముందు మంగుళూరు నుంచి రియాజ్ భత్కల్ పేలుడు పదార్థంతో పాటు ఇతర ఉపకరణాలను ఓ బస్సు ద్వారా పంపాడు. వీటిని అనీఖ్, అక్బర్‌లు చాదర్‌ఘాట్‌లో రిసీవ్ చేసుకున్నారు. 2013లో మాత్రం తబ్రేజ్ నేరుగా మంగుళూరు నుంచి తీసుకువచ్చాడు. ఇతడిని మోను ఎల్బీనగర్ చౌరస్తాలో రిసీవ్ చేసుకుని తమ డెన్‌కు వెంటపెట్టుకు వెళ్లాడు. 2007లో చెక్కతో చేసిన షేప్డ్ బాంబుల్ని పేల్చగా.. 2013లో మాత్రం ప్రెషర్ కుక్కర్లతో తయారు చేసిన బాంబుల్ని పేల్చారు. రెండు సందర్భాల్లోనూ పేలుడు పదార్థంగా అమోనియం నైట్రేట్‌నే వినియోగించారు.

రెండుసార్లూ మారిన 'టార్గెట్స్'

ఈ రెండు ఆపరేషన్లలోనూ ఉగ్రవాదులు ఆఖరి నిమిషంలో అనుకోని ప్రాంతాన్ని టార్గెట్‌గా చేసుకుని బాంబు పెట్టాల్సి వచ్చింది. 2007లో ఉగ్రవాదులు టార్గెట్ చేసిన ప్రాంతాల్లో గోకుల్ చాట్, దిల్‌సుఖ్‌నగర్‌లతో పాటు హుస్సేన్‌సాగర్‌లో తిరిగే షికారు బోటు ఉంది. అయితే.. ఇందులో బాంబు పెట్టేందుకు ట్రిగ్గర్ ఆన్ చేసుకుని ఆటోలో వెళ్లిన అనీఖ్.. ఆటోవాలాకు చెల్లించేందుకు అవసరమైన చిల్లర లేకపోవడంతో బాంబు పేలే సమయం సమీపించి లుంబినీపార్క్ లేజేరియం వద్ద వదిలి వెళ్లాడు. 2013 ఫిబ్రవరి 21న సైతం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఏ–1 మిర్చి సెంటర్‌తో పాటు దాని వెనుక ఉన్న ఓ మద్యం దుకాణాన్ని టార్గెట్ చేశారు. అయితే.. అక్కడికి బాంబుతో కూడిన సైకిల్‌ను తీసుకువెళ్తున్న వఖాస్ సమయం మించిపోతుండటంతో 107 బస్టాప్ వద్ద పార్క్ చేసి వెనక్కు వెళ్లిపోయాడు.

'ఆపరేషన్ దూల్‌పేట' సక్సెస్

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి, డ్రగ్స్ నియంత్రణలో భాగంగా ఎక్సైజ్ అధికారులు చేపట్టిన 'ఆపరేషన్ ధూల్‌పేట్' కొనసాగుతోంది. ఇప్పటి వరకు గడిచి న 250 రోజుల్లో 102 కేసుల్లో 425 మందిని నిందితులుగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వా రిలో 327 మందిని అరెస్టు చేసి జైలుకు తరలించా రు. 13 మందిని బైండోవర్ చేశారు. మరో 85 మంది నిందితులు పరారీలో ఉన్నారు. మొత్తం 401 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే 147 సెల్‌ఫోన్‌లు, 58 బైక్‌లు, 2 కార్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా, ఏపీ, తదితర రాష్ట్రాల నుంచి నగరానికి గంజాయి సరఫరా చేసే ముఠాలపైన నిఘాను కఠినతరం చేశారు. పీడీ యాక్టులతో పాటు, పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు. తప్పించుకొంటున్న లేడీడాన్‌ల ఆటకట్టించినట్లు చెప్పారు. గతేడాది జూలై 17వ తేదీన ఎక్సైజ్‌శాఖ ఆపరేషన్ ధూల్‌పేట్‌ను ప్రారంభించింది. ఇప్పటి వరకు సాధించిన ఫలితాలను దృష్టిలో ఉంచుకొని నగరమంతటా ఇదే తరహాలో దాడులు, తనిఖీలను ఉధృతం చేసేందుకు ఎక్సైజ్‌శాఖ ప్రణాళికలను రూపొందించింది. ప్రస్తుతం ధూల్‌పేట్‌లో 90 శాతం గంజాయి అమ్మకాలు తగ్గాయని, పూర్తిగా నిర్మూలించే వరకు దాడులను కొనసాగిస్తామని ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి తెలిపారు.